ఈనాడు సంగారెడ్డి
గురువారం అక్టోబరు 10, 2024


ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో సరస్వతీదేవిగా భవానీమాత


సంగారెడ్డిలో వాసవీమాతకు మహాలక్ష్మి అలంకరణ


జోగిపేటలో క్లాక్‌టవర్ వద్ద దుర్గామాత

మోక్ష ప్రదాయిని.. విశ్వ రూపిణి..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం జిల్లాలోని దుర్గామాత మండపాలు, ఆలయాల్లో అమ్మవారిని వేర్వేరు రూపాల్లో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజల్లో పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, సంగారెడ్డి గ్రామీణ, జోగిపేట.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. బుధవారం ధాన్యం కొనుగోళ్లపై కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రైతులకు మద్దతు ధర దక్కేలా చూడాలన్నారు.

బోధన కల.. సాకారమైన వేళ

బోధన వృత్తిలో స్థిరపడి.. బాలలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలనేది వారి కల. ఎన్ని అవాంతరాలు ఎదురైనా పట్టుదలతో డీఎస్సీకి సన్నద్ధమయ్యారు. ఉపాధ్యాయ నియామక పరీక్షలో మెరుగైన మార్కులు సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలు అందుకున్నారు.

– న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ.


పట్టుదలతో ఉపాధ్యాయులుగా ఎంపిక

హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉపాధ్యాయ నియామకపత్రం అందుకుంటున్న నిజాంపేటకు చెందిన ప్రవంతి

అబ్బెంద... గురువుల అడ్డా

నారాయణఖేడ్ రూరల్: సుమారు రెండు వేల జనాభా ఉన్న నారాయణఖేడ్ మండలంలోని అబ్బెంద గ్రామం గురువులకు నెలవుగా మారింది. తాజాగా ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో ఈ గ్రామం నుంచి ఐదుగురు ఉపాధ్యాయ పోస్టులు సాధించారు. మడపతి శివశంకర్, బిరాదర్ విజయలక్ష్మి స్కూల్ అసిస్టెంట్లుగా కొలువులు సాధించారు. మూల్గె శ్వేత, సిద్గార్ గోవర్ధన్, సిద్గార్ ప్రియాంకలు ఎస్జీటీలుగా ఎంపికయ్యారు. వీరిలో గోవర్ధన్, ప్రియాంకలు అక్కాతమ్ముళ్లు. ఉద్యోగాలు సాధించిన వారందరూ వ్యవసాయ కుటుంబాలకు చెందినవారే. ఇప్పటికే ఈ గ్రామం నుంచి 30 మంది ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. ఒకరిని చూసి మరొకరు స్ఫూర్తి పొందుతూ డీఎస్సీకి సన్నద్ధమయ్యామని ఎంపికనైనవారు తెలిపారు.


గ్రామ కూడలి

అంధత్వం.. అడ్డుకాలేదు

జహీరాబాద్, కోహీర్: కోహీర్ మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన బుర్తి పాడ్ ప్రవీణ్ అంధుడు. ఆయనకు చదువుపై ఉన్న ఆసక్తిని గమనించి తల్లిదండ్రులు కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినప్పటికీ డిగ్రీ వరకు చదివించారు. డీఈడీ చేశారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధించే పాఠాలు వినడంతో పాటు, ఇంటి వద్ద కుటుంబీకులు, స్నేహితుల సహాయంతో పుస్తకాలను చదివించడం, చరవాణి ద్వారా విని.. చదువులో రాణించారు. ప్రభుత్వ అనుమతితో ఇతరుల సాయంతో డీఎస్సీ రాశారు. ఎస్జీటీగా ఎంపికయ్యారు.


ప్రవీణ్

అన్నాచెల్లెళ్లు సాధించారు

జహీరాబాద్, కోహీర్: కోహీర్ మండలం ఖానాపూర్‌కు చెందిన శోభ- అంజయ్య దంపతుల సంతానం అవినాష్, సబిత. తల్లిదండ్రులు తక్కువ స్థాయి ఉద్యోగం చేస్తున్నప్పటికీ పిల్లలిద్దరిని బాగా చదివించారు. ఈ ఏడాది డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ చూపించారు అన్నాచెల్లెళ్లు అవినాష్, సబిత ఎస్జీటీలుగా ఎంపికయ్యారు.


అవినాష్, సబిత

ఒకే గ్రామం.. ముగ్గురికి కొలువులు


యోగేశ్వర్ | సాని కృష్ణ | తిప్పని మారుతి

సిర్గాపూర్: మండలంలోని బొక్కస్‌గావ్ గ్రామానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.

● **కోచింగ్ లేకుండానే:** యోగేశ్వర్‌ది పేదరిక నేపథ్యం కావడంతో ఎలాంటి కోచింగ్ లేకుండానే డీఎస్సీకి సొంతంగా సన్నద్ధమయ్యారు. స్కూల్ అసిస్టెంట్ సాంఘికశాస్త్రం విభాగంలో జిల్లా మొదటి ర్యాంకు సాధించారు. ఉపాధ్యాయ నియామక పత్రం అందుకున్నారు.

● **పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం వదిలి:** సాని కృష్ణ నిరుపేద కుటుంబంలో జన్మించారు. పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఈ ఏడాది డీఎస్సీ ప్రకటన రావడంతో పంచాయతీ కార్యదర్శి ఉద్యోగానికి రాజీనామా చేశారు. కష్టపడి చదివారు. ఎస్జీటీగా ఎంపికయ్యారు.

● **బాధను దిగమింగుకొని..:** తిప్పని మారుతి గతంలో ఉపాధ్యాయ, పంచాయతీ కార్యదర్శి, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. అయినప్పటికీ నిరుత్సాహం చెందలేదు. ఈ ఏడాది మరింత పట్టుదలతో చదివి డీఎస్సీ రాశారు. ఎస్జీటీ విభాగంలో కొలువు సాధించారు.

రూ.177 కోట్లతో సింగూరు కాల్వలకు సీసీ లైనింగ్: మంత్రి దామోదర్

రాయికోడ్, న్యూస్‌టుడే: రాయికోడ్ ప్రాంతంలో రూ.3 కోట్ల అంచనా వ్యయంతో 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పత్తి గోదాం నిర్మిస్తామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. బుధవారం రాయికోడ్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుధాకర్‌రెడ్డి, పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ జి.అంజయ్యతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే రాయికోడ్‌లో మార్కెట్ యార్డు ఏర్పాటు చేశామని, అభివృద్ధికి కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. రూ.2.37 కోట్లతో సింగితంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చిమ్నాపూర్‌లో ఆరోగ్య ఉప కేంద్రాలకు నిధులు మజూరు చేశామన్నారు. రూ.177 కోట్ల అంచనాతో సింగూరు కాల్వల సీసీ లైనింగ్ పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తానని, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. అంతకుముందు రాయికోడ్‌లోని ముమ్మాదేవి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డీఎంఓ రియాజుద్దీన్, డీపీఆర్ఓ ఏడుకొండలు, ఆర్డీఓ రాజు, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ఎంఈవోలకు తాఖీదులు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ నెల 5న నిర్వహించిన ఉపాధ్యాయ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ముగ్గురు మండల విద్యాధికారులకు డీఈవో వెంకటేశ్వర్లు బుధవారం తాఖీదులు జారీ చేశారు. కార్యాలయ పని వేళల్లో కార్యక్రమం నిర్వహించారని పేర్కొంటూ సంగారెడ్డి, సదాశివపేట, కొండాపూర్ ఎంఈవోలు విద్యాసాగర్, శంకర్, దశరథ్‌లపై కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న వీరికి తాఖీదులు ఇచ్చి వివరణ తీసుకోవాలని డీఈవోను ఆదేశించారు. దీంతో ముగ్గురు ఎంఈవోలకు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు తాఖీదులు పంపించారు.


కంది మండలం బ్యాతోల్‌లో..


సంగారెడ్డిలో బతుకమ్మ వద్ద పూజలు చేస్తున్న మంత్రి దామోదర్ తదితరులు

తీరొక్క పూలు.. ఆనందాల జోరు


బతుకమ్మతో కలెక్టర్ వల్లూరు క్రాంతి


కలెక్టర్ కుమార్తె ఆర్యన్


సంగారెడ్డిలో నీటిపారుదల శాఖ ఉద్యోగులు

జిల్లావ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. కలెక్టరేట్‌లో బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళా ఉద్యోగులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ, కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టర్ తన కూతురితో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. సంబరాల్లో భాగంగా మహిళా ఉద్యోగులు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి తదితరులు పాల్గొన్నారు. జిల్లా నీటిపారుదల శాఖ కార్యాలయంలో దుర్గాదేవికి ఆ శాఖ సీఈ పూజలు చేశారు. ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. సదాశివపేట పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, పురపాలక సంఘం అధ్యక్షురాలు అపర్ణపాటిల్ తదితరులు పాల్గొన్నారు. కంది మండలంలోని బ్యాతోల్, చిమ్నాపూర్, కందిలోనూ మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

–న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్, సంగారెడ్డి అర్బన్, కంది, సదాశివపేట.


సదాశివపేట హనుమాన్ మందిరం వద్ద..


హత్నూర మండలం చింతల్‌చెరులో..

అవగాహనతోనే ఆర్థిక వృద్ధి

మహిళా సంఘాలకు ప్రత్యేక సమావేశాలపై మెప్మా ఆదేశాలు

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ

మహిళలు ఆర్థికవృద్ధి చెందడమే పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) లక్ష్యం. ఇందుకోసం మెప్మా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. మహిళలు చిరు వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా ఎలా ఎదగాలో అవగాహన సమావేశాలు నిర్వహించాలని ఇటీవల మెప్మా ఆదేశాలు జారీ చేసింది. దీంతో పాటు వారికి రక్షణగా ఉన్న హక్కులు, చట్టాలపైనా వివరించాలి. మహిళా సంఘాల సమావేశాలు నిర్వహించే సమయంలో వీటిపైనా చర్చించాలి.

ఏయే అంశాలపై..: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఆర్థిక అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతి నెలా వార్డుల వారీగా ఈ కార్యక్రమాలు చేపట్టాలి. ఆసుపత్రుల్లో భ్రూణ హత్యలు అరికట్టడం, ఇద్దరు ఆడపిల్లలున్న తల్లిదండ్రులు పిల్లలను ఎలా చదివించాలి?, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు ఎదురైతే ఎవరికి ఫిర్యాదు చేయాలి, స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదిగేందుకు పొదుపు సంఘాల సభ్యులు రుణాల కోసం ఎలా దరఖాస్తు చేయాలి, పొదుపు పథకాల గురించి అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

వ్యాపార మెలకువలపై..

మహిళలు బ్యాంకు రుణాలు తీసుకున్న తర్వాత సొంత అవసరాలకు వాడుకుంటున్నారని మెప్మా అధికారులు గుర్తించారు. సొంత అవసరాలకు వాడుకొని.. నెల నెలా ఈఎంఐ చెల్లింపుకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. దీన్ని గుర్తించిన అధికారులు మహిళలు రుణాలతో వ్యాపారం చేసేలా మెలకువలపైనా అవగాహన కల్పించనున్నారు. రుణాలు తీసుకొని వ్యాపారం చేస్తూ.. లాభాలు గడిస్తున్న వారి అభిప్రాయాలను సమావేశాల్లో వివరించనున్నారు. కొత్తగా వ్యాపారం చేసే వారిని ప్రోత్సహించనున్నారు. ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలన్నదే మెప్మా లక్ష్యం.



● జిల్లాలోని పట్టణాల్లో మహిళా సంఘాలు: 8,340
● వాటిలో సభ్యులు: 52,125

సద్వినియోగం చేసుకోవాలి: మల్లీశ్వరి, మెప్మా డీఎంసీ

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వీటితో పాటు వారికి రక్షణగా ఉన్న చట్టాలు, హక్కులపైనా అవగాహన కల్పిస్తాం. అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలలి.

సమీకృత గురుకులం మంజూరు చేయండి


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: ఖేడ్ నియోజకవర్గానికి మొదటి విడతలోనే సమీకృత గురుకులం మంజూరు చేయాలని కోరుతూ ఖేడ్ ఎమ్మెల్యే డా.పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను బుధవారం హైదరాబాదులో కలిసి విన్నవించారు. గురుకులంతో పాటు నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరారు. ఈ మేరకు సీఎం నుంచి హామీ లభించిందని ఎమ్మెల్యే తెలిపారు.

పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీధర్

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా సంగారెడ్డికి చెందిన చందా శ్రీధర్ నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి నియామకపత్రాన్ని అందించారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని శ్రీధర్ తెలిపారు.

పట్టుకు ప్రోత్సాహం

అందుబాటులో రాయితీ పథకాలు

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

పట్టు పరిశ్రమ.. వ్యవసాయ ఆధారిత లాభదాయకమైన కుటీర పరిశ్రమ. ఒక ఎకరంలో మల్బరీ సాగు చేస్తే 5 నుంచి 10 మందికి ఉపాధి లభిస్తుంది. పట్టు పరిశ్రమకు జిల్లాలో పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. అందుకే ఈ పరిశ్రమ విస్తరణపై అధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే 150 ఎకరాల్లో మల్బరీ సాగుచేస్తున్నారు. మరింత మంది రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇందుకు ముందుకు వచ్చే రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

ఉపాధి హామీ పథకం ద్వారా..

ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు కలిగిన వారు అర్హులు. ఐదు ఎకరాలకు మించకుండా రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా రాయితీ అందజేస్తారు. మల్బరీ తోట నిర్వహణకు రెండు సంవత్సరాలకు రూ.70వేలు అందజేస్తారు. పట్టు పురుగులు పెంచే గది నిర్మాణానికి రూ.90వేల వరకు రాయితీగా ఇస్తారు.

15 ఏళ్లకు పైగా ఉపాధి

పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మల్బరీ మొక్కలు పెంచుతున్నారు. ఒక్కో మొక్కను రూ.2 చొప్పున విక్రయించాలని నిర్ణయించారు. మల్బరీ తోట వేశాక పట్టు పురుగులు పెంచాల్సి ఉంటుంది. మల్బరీ ఒకసారి నాటితే 15-20 సంవత్సరాల వరకు ఉంటుంది. పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల నుంచి మల్బరీ మొక్కల్ని తీసుకోవచ్చు. వీటిని పెంచేందుకు గది నిర్మాణానికి రూ.35వేలు, ఇతర పరికరాలకు రూ.10,200 రాయితీ కింద అందజేస్తూ రైతులను ప్రోత్సహిస్తున్నారు.


పట్టు పురుగుల పెంపకం

వ్యాధినిరోధక ద్రావకాల మిశ్రమం తయారు చేసేందుకు రూ.2,500 రాయితీగా అందుతుంది. కిలో పట్టుగూళ్లకు రూ.75 చొప్పున ప్రోత్సాహంగా అందిస్తారు. పట్టు పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చే రైతులకు రూ.2.85లక్షల రాయితీ పథకం అమలులో ఉంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.2.92 లక్షలు, షెడ్డు నిర్మాణానికి రూ.78 వేలు అందజేస్తారు.

రైతులను ప్రోత్సహిస్తున్నాం

పట్టుపరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చే రైతులకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. తక్కువ సమయంలో అధిక రాబడులు పట్టు పరిశ్రమతోనే సాధ్యం. పట్టుగూళ్ల విక్రయం ద్వారా ఆదాయానికి తోడు ప్రభుత్వం కూడా అదనపు ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. ఈ సంవత్సరం 40 ఎకరాలు లక్ష్యం కాగా ఇప్పటికే 20 ఎకరాలు సాగయింది. మిగతా వారు దరఖాస్తు చేసుకుంటే అర్హులను ఎంపికచేస్తాం. –సోమేశ్వరరావు, ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ జిల్లా అధికారి.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం: ఎస్పీ



సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: పండగ వేళ పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సీహెచ్ రూపేష్ ఆదేశించారు. బుధవారం నిర్వహించిన దృశ్య మాధ్యమ సమీక్షలో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్, పెట్రోలింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో గంజాయి సాగు, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఇందుకోసం నిత్యం తనిఖీలు నిర్వహించాలని స్పష్టం చేశారు. మట్కా, గ్యాంబ్లింగ్‌లపైనా ప్రత్యేక నిఘా ఉండాలన్నారు. అలాంటి నిర్వాహకులను బైండోవర్ చేయాలని ఆదేశించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బాబానగర్‌లో సీపీఎం ఏరియా మహా సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగవంతం చేయడంతో పాటు స్కానింగ్ సేవల్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. రాజీవ్ పార్కును సుందరీకరించి, అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. పట్టణంలోని పార్కు స్థలాలు కబ్జా కాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ధర్నా


ఎమ్మార్పీఎస్ శ్రేణుల నిరసన

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ చేపట్టి.. ఉద్యోగ నియామకాల్లో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మైసగళ్ల బుచేంద్ర మాట్లాడుతూ.. అసెంబ్లీ సాక్షిగా ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తానని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ తర్వాత మాట తప్పారని విమర్శించారు. అనంతరం కలెక్టరేట్ ఏవో పరమేశంకు వినతి పత్రం అందించారు.

2వేల ఏళ్లనాటి టెర్రకోట గిరక లభ్యం



నంగునూరు, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా నంగునూరులో 2వేల ఏళ్ల నాటి టెర్రకోట మట్టి గిరక లభ్యమైనట్లు కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధన సభ్యుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. బుధవారం నంగునూరు పాటిగడ్డ సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో 5 అంగుళాల ఎత్తు, 3 అంగుళాల వెడల్పుతో కలిగిన అద్భుతమైన పనితనం కలిగిన మట్టి గిరక లభ్యమైంది. దీన్ని నీళ్లు తోడడానికి గానీ.. మగ్గం నేయడానికి ఉపయోగించినట్లు తెలుస్తోంది. ఈ గిరకకు ఉన్న గాడి లోతు, అంచుల వంపును బట్టి దీని మీద మందపు తాళ్ల వాడినట్లు గుర్తులు కనిపిస్తున్నాయని తెలిపారు.

గడువులోగా స్టేషన్ పునరాభివృద్ధి పనులు

డీఆర్ఎం భరతేశ్‌కుమార్ జైన్



పునరాభివృద్ధి పనులు పరిశీలిస్తున్న డీఆర్ఎం భరతేశ్‌కుమార్ జైన్

జహీరాబాద్ అర్బన్: అమృత్ భారత్ స్టేషన్ పునరాభివృద్ధి పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని దక్షిణమధ్య రైల్వే డీఆర్ఎం భరతేశ్‌కుమార్ జైన్ అధికారులకు సూచించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ రైల్వేస్టేషన్‌ను బుధవారం తనిఖీ చేసి చేపడుతున్న పనులను పరిశీలించారు. స్టేషన్ ముఖద్వారం, వెయిటింగ్ హాల్, సీవోపీలు, ఎస్కలేటర్ సహా పార్కింగ్ ప్రాంతాల్లో నిర్మాణాలను సందర్శించి పనుల నెమ్మదిగా జరుగుతున్న తీరుపై అసంపూర్తి వ్యక్తం చేశారు. స్టేషన్ ప్రధాన ముఖద్వారం ఎర్రరాయి కట్టడంతో ఉన్నందున కొత్త నిర్మాణ అనుసంధానంలో ఇబ్బందులపై అధికారులు వివరించారు. అవసరమైతే పూర్తిగా తొలగించి త్వరగతిన నిర్మాణం పూర్తిచేయాలని సూచించారు. స్టేషన్ మేనేజర్ మాధవకృష్ణ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. బీదర్-తిరుపతి రైలును జహీరాబాద్‌లో నిలిపేలా చూడాలని స్థానిక భాజపా నేతలు వినతిపత్రం అందజేశారు.

మనసు.. మాట వింటోందా!



'మీరు మానసికంగా ఎంత స్థిరంగా ఉన్నా.. మీ మాటలు, చర్యల వల్ల కుటుంబ సభ్యులు, ఇతరులు ఎంతలా బాధపడుతున్నారో?' ఎప్పుడైనా ఆలోచించారా.. మనసు స్థితి తేడాగా ఉందని తెలుస్తున్నా పరిష్కార మార్గానికి వైద్యులను ఆశ్రయించేందుకు వెనుకాడుతున్నారా.. అనేక అపోహలు.. మూఢ నమ్మకం.. తీవ్రమైన ఒత్తిడి, తెలియని ఆందోళన.. తరచూ తప్పుడు ఆలోచనలు.. వీటి నుంచి బయట పడితేనే జీవితం చక్కగా సాగుతుంది. చాలామంది వివిధ కారణాలతో మానసిక పరమైన జబ్బులతో వేదనకు గురవుతున్నారు. బాధితులతో పాటు కుటుంబ సభ్యులు తల్లడిల్లుతున్నారు. అందుబాటులో ఉన్న వైద్య సేవలను వినియోగించుకోవాలని నిపుణులు చెబుతున్నారు. నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

న్యూస్‌టుడే, సిద్దిపేట:

మానసిక ఆరోగ్యంపై అవగాహన లేక కొందరు కుంగిపోతున్నారు. సమస్య ఉన్నా.. ఏమి లేదనే భావనతో కాలం వెళ్లదీస్తున్నారు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో అత్యధిక శాతం ఆరోగ్యంగా ఉన్నా.. అనారోగ్య సమస్యలు ఉన్నాయనే భావన (హైపో కాండ్రియాసిస్)తో ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వివిధ రకాల పరీక్షలు చేస్తున్నా.. పరిష్కారం లభించక మదన పడుతున్నారు. ఎక్కువగా గుండె జబ్బు ఉందనే భావన వ్యక్తమవుతోంది. ఆయా పరిణామాలతో పలువురు ఇంటికే పరిమితవుతున్నారు. చివరికి మానసిక వైద్య నిపుణులను సంప్రదించడం ద్వారా అపోహలు తొలగిపోతున్నాయి. చిన్నపాటి విషయాలకే ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఉదంతాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. కుటుంబ కలహాలతో మనోవేదనకు గురై.. మానసిక అనిశ్చితి ఏర్పడుతోంది.



బాధితుడితో మాట్లాడుతున్న డాక్టర్ శాంతి



కీలకంగా సేవలు

సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాల అనుబంధ సర్వజన ఆసుపత్రిలో మానసిక వైద్య విభాగం (సైక్యాట్రీ) సేవలు కీలకంగా మారాయి. నిత్యం సగటున 50 మంది ఓపీ సేవలను వినియోగించుకుంటున్నారు. ఇక్కడ మొత్తం 30 పడకలు అందుబాటులో ఉన్నాయి. 15 - 20 మంది ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. ప్రాథమిక దశలో మానసిక జబ్బులతో చేరిన వారికి కౌన్సెలింగ్ ద్వారా మార్పు తెస్తున్నారు. పలు రకాల థెరపీలను అందిస్తున్నారు. రోగిస్థాయి ఆధారంగా గరిష్ఠంగా ఆరు నెలల వరకు చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్యం బాగైన తరువాత వారిని ఉదాహరణగా చూపుతూ.. మార్పు సాధ్యమంటూ రోగుల్లో ధైర్యాన్ని నూరిపోస్తున్నారు. మానసిక ఒత్తిడి, కుంగుబాటు, చేసిన పనే చేయడం, సైకోసిస్, తదితర విభాగాల్లో బాధితులకు బాసటగా నిలుస్తున్నారు. డీ-అడిక్షన్ కేంద్రం సేవలు కీలకంగా మారుతున్నాయి.

సకాలంలో సేవలు పొందాలి..

– ప్రొఫెసర్ డా. శాంతి, మానసిక వైద్య నిపుణురాలు (సిద్దిపేట సర్వజన ఆసుపత్రి)

సేవలు అందించే క్రమంలో సైక్యాట్రీ చరిత్ర మొత్తం తెలుసుకుంటాం. కుటుంబ, వ్యక్తిగత వివరాలు, మానసిక స్థితి తెలుసుకొని ఒక అంచనాకు వస్తుంటాం. మానసిక స్థితిని పరీక్షిస్తాం. ఆలోచనలు, ఏకాగ్రత, నిర్ణయాలు తీసుకునే విచక్షణ, మాట్లాడే విధానం.. ప్రతీది కచ్చితమైన అంచనాతో చికిత్సలు చేస్తుంటాం. అవసరమైన వైద్య పరీక్షలు ఉంటాయి. కౌన్సెలింగ్, చికిత్స, థెరపీల ద్వారా బాగు చేస్తున్నాం. కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ చేపడుతున్నాం. మానసిక సమస్యలతో బాధపడే వారు సకాలంలో ఆసుపత్రికి రావడం లేదు. మార్పు రావాలి. డబ్బును వృథా చేసుకోవద్దు. ప్రతీ సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందని గ్రహించి నిర్ణయం తీసుకోవాలి.

పరిణామాలు ఇలా..



- మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారు. మానేసే ప్రయత్నాలు విఫలమై తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారు.
- స్వతహాగా కలవరపాటుకు గురవుతున్నారు. అనుమానాలు పెంచుకుంటున్నారు.
- అతి శుభ్రత (ఓసీడీ)తో ఇతరులను ఇబ్బందికి గురిచేస్తున్నారు.
- అభూత కల్పనతో గడిపేస్తున్నారు.
- మూఢ నమ్మకాలను విశ్వసిస్తున్నారు.
- లైంగిక, నిద్రలేమి లాంటి సమస్యల్లో చిక్కుకుంటున్నారు.
- విశ్రాంతి లేని జీవనం, తీవ్రమైన ఒత్తిడితో బాధపడుతున్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో నాలుగు రజతాలు



అథ్లెట్లతో వెంకటస్వామిగౌడ్

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: హనుమకొండలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సిద్దిపేట జిల్లా అథ్లెట్లు సత్తా చాటారు. ఏకంగా నాలుగు రజత పతకాలు సాధించారు. డెకథ్లాన్, హైజంప్ అంశాల్లో రాఘవాపూర్‌కు చెందిన గ్యార లీలాఆనంద్ రెండు రజత, అండర్-18 విభాగంలో కొండపాకకు చెందిన నగేశ్ జావెలిన్‌త్రోలో రజత పతకం, ఇదే కేటగిరిలో షాట్‌పుట్‌లో అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు చెందిన వాసు రజత పతకం సాధించారని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, వెంకటస్వామిగౌడ్ తెలిపారు. ఈ మేరకు జిల్లా యువజన క్రీడల ఇన్‌ఛార్జి అధికారి జయదేవ్ ఆర్య, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి సౌందర్య, ప్రతినిధులు, శిక్షకులు అభినందించారు.

'విశ్వబ్రాహ్మణుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు'

సిద్దిపేట: విశ్వబ్రాహ్మణుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని, కార్పొరేషన్ సాధనకు సమష్టిగా ఉద్యమించాలని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి అన్నారు. సిద్దిపేటలో సమావేశానికి హాజరైన ఆయన జిల్లా అధ్యక్షుడు సాయన్నగారి శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. కుటీర పరిశ్రమలకు ఉచితంగా విద్యుత్తు సరఫరా చేయాలని, 50 ఏళ్లు నిండిన వారికి పింఛను ఇవ్వాలని, రాయితీపై కలపను అందించాలని, అటవీ అధికారుల దాడులు నివారించాలన్నారు. సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు గోపాలచారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్ తదితరులు ఉన్నారు.

జ్ఞానసమాజమే లక్ష్యం

27న 'స్వేరోస్' కన్వెన్షన్: ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, ప్రతినిధులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: విద్యాభ్యాసాన్నే ఆయుధంగా మలుచుకుని జ్ఞాన సమాజమే లక్ష్యంగా స్వేరోస్ నెట్‌వర్క్ కొనసాగుతుందని సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. కులాలు, మతాలకు అతీతంగా తమ నెట్‌వర్క్ నడుస్తుందన్నారు. అణచివేత, సామాజిక రుగ్మతలు, గంజాయికి వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని చెప్పారు. ఈనెల 27న సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో స్వేరోస్ జాతీయ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సిద్దిపేటలో కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశానికి ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. బిజినెస్ అంశంపై సమాలోచనలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా స్వయం ఉపాధి వైపు యువత ఏ విధంగా నడవాలనే అంశంపై చర్చిస్తామన్నారు. రాష్ట్ర కన్వీనర్ దుర్గయ్య, కోకన్వీనర్ వీరన్న, ప్రధాన కార్యదర్శి ప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు ఉప్పలేటి బాబు, ప్రధాన కార్యదర్శి చిన్నికృష్ణ, ప్రతినిధులు పాల్గొన్నారు.



సిద్దిపేట: పార్వతీమాత ఆలయంలో నాణేలతో అభిషేకం



కుమార్తెలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది



సంగారెడ్డిలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, అధికారిణులు, సిబ్బంది

దర్శనంతో తాదాత్మ్యం.. ఆటాపాటతో ఆనందం

న్యూస్‌టుడే, పాపన్నపేట, మెదక్, సంగారెడ్డి టౌన్, సిద్దిపేట టౌన్: 'శ్రీమహాకాళి మహాలక్ష్మి మహాసరస్వతి బాలత్రిపురసుందరి మాతాయై నమః' అని మండపాలు, అమ్మవారి ఆలయాల్లో మంత్రోచ్ఛారణలు మార్మోగుతున్నాయి. 'ఇద్దరక్కచెల్లెళ్లు ఉయ్యాలో.. ఒక్కూరికిచ్చి ఉయ్యాలో..' అని మహిళల ఆటాపాట సందడి పూల పరిమళాల మధ్య ఉత్సాహభరితం చేస్తోంది. మెదక్, సంగారెడ్డి కలెక్టరేట్‌లలో కలెక్టర్లు రాహుల్‌రాజ్, వల్లూరు క్రాంతి, వారి కుటుంబ సభ్యులు బతుకమ్మల చుట్టూ ఆడారు. కొన్నిచోట్ల 8వ రోజున సద్దుల బతుకమ్మ పండుగ చేసి స్థానిక నీటివనరుల్లో నిమజ్జనం చేశారు.



సరస్వతిమాత అలంకరణలో ఏడుపాయల వనదుర్గ

నదిలో పడి యువకుడి మృతి



రమేష్

మనూరు, న్యూస్‌టుడే: ప్రమాదవశత్తు కాలు జారి నదిలో పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మనూరు మండలం రాయిపల్లి వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మున్నూర్ రమేష్(26) కాళ్లు కడుక్కుందామని నది వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి నదిలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. రమేశ్ తండ్రి నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

చెరువులో పడి రైతు..



యాదయ్య

టేక్మాల్, న్యూస్‌టుడే: స్నానం చేసేందుకు చెరువులోకి వెళ్లి ప్రమాదవశాత్తు ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలం కుసంగి గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై రాజేశ్ తెలిపిన వివరాలు.. కుసంగి గ్రామానికి చెందిన ముస్లాపరం యాదయ్య(50) వ్యవసాయంతో పాటు మేకలను పెంచుతూ జీవిస్తున్నాడు. ఈ నెల 7న మేకలు మేపడానికి వెళ్లాడు. స్థానిక పెద్ద చెరువులో స్నానం చేద్దామని దిగాడు. ఈత రాకపోవడంతో చెరువులో మునిగి చనిపోయాడు. మేకలు ఇంటికి వచ్చినా యాదయ్య రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. ఆచూకీ దొరకలేదు. బుధవారం చెరువులో మృతదేహం తేలింది. తమ్ముడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. యాదయ్యకు భార్య బూదవ్వ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లలకు వివాహాలు అయ్యాయి.

ఈత నేర్పేందుకు వెళ్లి మృత్యువాత

చిన్నకోడూరు, నంగునూరు: ఈత నేర్పడానికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందిన ఘటన చిన్నకోడూరు మండలంలోని ఓబులాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ఆసీఫ్ తెలిపిన వివరాలు.. జక్కుల ఎల్లయ్య(38) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి భార్య భారతవ్వ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం ఉదయం ఎల్లయ్య తన సోదరుడు కుమారుడికి ఈత నేర్పించడానికి చెరువు వద్దకు తీసుకెళ్లాడు. ఎల్లయ్య చెరువులోకి దిగి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. గమనించిన బాలుడు పరుగెత్తుకుంటూ వచ్చి గ్రామస్థులకు తెలిపాడు. వారు వెళ్లి ఎల్లయ్యను బయటకు తీసి చూడగా అప్పటికే మృతి చెందాడు. తల్లి ఎల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదైంది.


రామలింగేశ్వరస్వామీ.. నీవైనా చెప్పవూ..

- 'ప్రసాద్' పథకానికి 'కూడవెల్లి' ఎంపికై రెండేళ్లు
- అడుగులు పడక.. పర్యాటకాభివృద్ధికి నోచుకోక..

న్యూస్‌టుడే, దుబ్బాక



శిథిలావస్థకు చేరిన గుళ్లు



రామలింగేశ్వర స్వామి

మన దేశంలో పర్యాటక రంగం ఎక్కువగా ఆధ్యాత్మిక క్షేత్రాల చుట్టూ ఉంటోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ కోణాల్లో ఆదాయాన్ని తెచ్చి పెడుతోంది. కానీ ప్రధానంగా భక్తులకు, పర్యాటకులకు మౌలిక వసతులను ప్రభుత్వం సమకూర్చితే ఆదరణ అధికంగా ఉంటుంది. రెండేళ్ల క్రితం సిద్దిపేట జిల్లా కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం 'ప్రసాద్' (తీర్థయాత్రల పునరుజ్జీవనం, ఆధ్యాత్మిక వారసత్వ వృద్ధి) పథకానికి ఎంపిక చేసింది. అమలు చేయడంలో వెనుకబాటులో ఉంది.

మిగిలినవి 9 ఎకరాలే

ఏడాది పొడవునా నిత్య పూజలను అర్చకులు నిర్వహిస్తున్నారు. వసతులు లేకపోవడంతో భక్తుల సంఖ్య రాకపోకలు తక్కువగా ఉంటోంది. గుడి భూములు అన్యాక్రాంతమయ్యాయి. ప్రస్తుతం కేవలం 9 ఎకరాలు మాత్రమే మిగిలాయి. ఇక్కడ 2004లో కల్యాణ మండపం నిర్మించినా పూర్తిస్థాయిలో వసతులు లేక వినియోగించటం లేదు. 2018లో దేవాదాయ శాఖ రూ.1.25 కోట్ల సర్వ శ్రేయోనిధి నుంచి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ప్రాకార మండపం, రాజ గోపురం, ప్రహరీ కొంతమేర పూర్తయ్యాయి. 'ప్రసాద్ పథకానికి ఎంపికైనా నేటి వరకు ఆలయ పరిసరాల్లో పనులు చేపట్టలేదని.. రాష్ట్ర దేవాదాయ, పర్యాటక అభివృద్ధి శాఖల దృష్టికి తీసుకెళ్తామని.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటామని ఈవో విశ్వనాథశర్మ తెలిపారు.

పథకం అమలైతే సమకూరేవి

- కూడవెల్లి వద్ద రూ.కోటి నిధులతో ఒక ఎకరా స్థలంలో 20 రకాల మౌలిక వసతులు నిర్మిస్తారు.
- తీర్థయాత్ర సమాచార కేంద్రం, వెయిటింగ్ లాంజ్, శౌచాలాయాలు, ప్రసాదం కౌంటర్లు, ప్రథమ చికిత్స కేంద్రం, సంచులు పెట్టే గదులు, క్యాంటీన్, దుకాణాలు, బహుళ ఉపయోగకరమైన హాల్.

2022 నుంచి ఏం చేశారు?

- ఆలయ ఈవో 2022 నవంబరులో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థకు, కేంద్ర పర్యాటక శాఖకు ప్రసాద్ పథకం అమలుకు కేటాయించే ఒక ఎకరా భూమి వివరాలు పంపించారు.
- పర్యాటక శాఖ అధికారులు ఆలయాన్ని సందర్శించారు.
- మౌలిక వసతులపై అంచనా వేసి, భూమి మట్టిని పరీక్షకు తీసుకెళ్లారు.

ఏమేం చేయాలి?

- కాశీ విశ్వనాథుడు, వేంకటేశ్వరుడు, బొబ్బిలి వీరన్న స్వామి గుళ్లు శిథిలమయ్యాయి. పునర్నిర్మించాలి.
- తాగునీరు సౌకర్యం కల్పించాలి.
- వాగులో పుణ్యస్నానాలు ఆచరించడానికి స్నాన ఘట్టాలు, దుస్తులు మార్చుకోవడానికి గదులు అవసరం.
- వాగులో వేసే పిండాలు, అస్థికలు, ఇతర్రత్రా కర్మకండ సామగ్రితో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఏర్పాట్లు చేయాలి.

గుడి విశేషాలు

- అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని రామేశ్వరంపల్లి పరిధిలో కూడవెల్లి వాగు ఒడ్డున గుడి నెలవైంది.
- శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగం అని క్షేత్రపురాణంతో ప్రసిద్ధికెక్కింది. శతాబ్దాల చరిత్ర ఆలయానికి ఉంది.
- కాశీ నుంచి ఆంజనేయస్వామి తెచ్చిన శివలింగం.. శ్రీరాముడు ప్రతిష్ఠించిందీ రెండూ ఒకే ప్రాణవట్టంపై దర్శించుకోవడం విశిష్టత.
- మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల భక్తులు ఎక్కువగా ఇక్కడికి వస్తారు.
- 'కాళేశ్వరం' ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలు కూడవెల్లి వాగులోకి ప్రవహిస్తుండటంతో ఏడాది పొడవునా గుడి వద్ద జలకళ ఉట్టిపడుతోంది.
- ఆలయ ప్రాంగణంలో రాధారుక్మిణీ వేణుగోపాలుడు, దాసాంజనేయుడు, సంగమేశ్వరుడు, కుమారస్వామి, వీరభడుడు, పార్వతిమాత, గణపతి గుళ్లు దర్శనమిస్తాయి.
- గుడి పక్కనున్న కూడవెల్లి వాగులో పితృదేవతలకు పిండ ప్రదానాలు, అస్థికల నిమజ్జనం నిర్వహించుకోవచ్చు.
- శ్రావణం, కార్తికం, మాఘ మాసాల్లో .. ఇతర పండుగల రోజుల్లో జాతరలు, విశేష పూజలు జరుగుతాయి.

పురాతన ఇల్లు.. ప్రేమగా హంగులు



రంగు వేయడంతో ఆకట్టుకుంటున్న పెంకులు



ఇంటి లోపలి భాగం

పెద్దలు ఇచ్చిన ఆస్తిపాస్తులను యథాతథంగా దశాబ్దాలు గడిచినా కాపాడుకుంటూ వాడుకోవడం అరుదుగా చూస్తుంటాం. ఇళ్లు ఒక దశకు శిథిలావస్థకు చేరుతాయి. వాటికి కొద్దిపాటి మార్పులు, మరమ్మతులు చేస్తే అనేక ఏళ్లపాటు కుటుంబానికి అండగా ఉంటాయి. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం గుండారెడ్డిపల్లికి చెందిన భూంపల్లి సంజీవరెడ్డి.. తన ఏడు దశాబ్దాల చరిత్ర ఉన్న ఇంటిని కొద్దిపాటి అధునాతన మార్పులు చేసుకొని కాపాడుకుంటున్నారు. అందులో భార్యతో కలిసి నివసిస్తున్నారు. చిన్నపాటి గుత్తేదారుగా పనులు చేసుకుంటున్న సంజీవరెడ్డికి పురాతన ఇంటిపై అమితమైన ప్రేమ. పైకప్పు పెంకులకు కొత్తగా రంగులు వేశారు. లోపల బండలు మార్చారు. ఇంటిలోని మొగురాలు, దూలాలు మార్చకుండానే వాటికి ఆకర్షణీయమైన రంగులు వేశారు. ఇంటిని పూర్తిగా తొలగించకుండానే అధునాతనంగా ఆకర్షణీయంగా మార్చుకున్నారు. ఊరిలో తన ఇల్లు వైవిధ్యంగా కనిపిస్తుండటం సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. వారి పిల్లలు విదేశాల్లో ఉంటున్నారు.

- న్యూస్‌టుడే, కోహెడ గ్రామీణం

వాహనం అదుపుతప్పి కార్మికుడి దుర్మరణం

మునిపల్లి, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుదేరా శివారు జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో కంపెనీ కార్మికుడు దుర్మరణం చెందాడు. ఏఎస్సై ఏసయ్య తెలిపిన వివరాలు.. సదాశివపేట పట్టణానికి చెందిన పరిగి సాయికిరణ్ (29) ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి. దిగ్వాల్ నుంచి సదాశివపేటకు బుధవారం ద్విచక్ర వాహనంపై వెళుతున్న క్రమంలో వాహనం అదుపుతప్పి పడిపోయాడు. తలకు బలమైన గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలోనే మృతి చెందాడు. భార్య వసంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

టేక్మాల్: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్సై రాజేశ్, స్థానిక ఆర్ఐ సాయిశ్రీకాంత్ తెలిపిన వివరాలు.. మహారాష్ట్ర ఉమర్గ గ్రామానికి చెందిన బాలాజి కుమ్మర్ సుమారు 35 క్వింటళ్ల రేషన్ బియ్యాన్ని తన ఆటోలో తరలిస్తున్నాడు. హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న క్రమంలో బుధవారం బొడ్మట్‌పల్లి శివారులో పోలీసులకు బియ్యం పట్టుబడ్డాయి. వాహనాన్ని ఠాణాకు తరలించారు. పట్టుబడిన బియ్యాన్ని పాపన్నపేటలోని ఓ రైస్ మిల్‌కు తరలించి అక్కడే నిల్వ ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు టేక్మాల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	114–00	డ్రెస్డ్	197–00
రిటైల్	136–00	స్కిన్‌లెస్	224–00

అమ్మమ్మ, నాయనమ్మల కళ్లుగప్పి

ఆడ శిశువు అపహరణ

- సీసీ ఫుటేజీలో అనుమానితుల కదలికలు గుర్తింపు
- సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఘటన



శిశువును తీసుకెళ్లినట్లు అనుమానిస్తున్న మహిళలు (సీసీ ఫుటేజీ)

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: భూమి మీద పడి ఒక్క రోజు కూడా కాకుండానే ఆ ఆడ శిశువు తల్లికి దూరమైంది. సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో అమ్మమ్మ, నాయనమ్మల పక్కన సేదతీరుతుండగా పట్టపగలు.. ఇద్దరు మహిళలు అపహరించుకు పోవడం కలకలం రేపింది. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా మనూరు మండలం దూదిగొండ గ్రామానికి చెందిన ఆటోడ్రైవరు అబ్బాస్ అలీ, నసీమా(25) దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. ఒక మగ బిడ్డ గతంలో మరణించారు. ఐదో కాన్పు కోసం భర్తతో కలిసి మంగళవారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో నసీమా సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు సిజేరియన్ ద్వారా ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఆ శిశువును కింద పడుకోబెట్టి మనమడితో కలిసి అమ్మమ్మ మునీబీ, నాయనమ్మ హమీదాలు మధ్యాహ్నం ఆస్పత్రి కారిడార్‌లో కూర్చున్నారు. బురకాలు ధరించిన ఇద్దరు గుర్తుతెలియని మహిళలు వారి కళ్లుగప్పి శిశువును ఎత్తుకెళ్లారు. కొద్దిసేపటి తర్వాత శిశువు కన్పించకపోవడంతో అవాక్కయి ఆస్పత్రి పర్యవేక్షకుడు అనిల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే పట్టణ సీఐ భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి డీఎస్పీ, సీఐలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. ఆసుపత్రితో పాటు పట్టణంలోని ఇతర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీలను జల్లెడ పట్టారు. తొలుత ఇద్దరు గుర్తుతెలియని మహిళలు ఆసుపత్రి లోపలికి వచ్చి శిశువును అపహరించి, బయట వేచి ఉన్న మరో ఇద్దరు మహిళలకు ఇవ్వగా వారు ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లినట్లుగా గుర్తించారు. ఆటోలో ఇద్దరు.. స్కూటీపైన ఇద్దరు ఘటనా స్థలికి చేరుకున్నట్లు సీసీ ఫుటేజీల్లో నమోదైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు.

పది బృందాల ఏర్పాటు

ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా పోలీసులను అప్రమత్తం చేశారు. చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. శిశువును గుర్తించేందుకు పది బృందాలను ఏర్పాటు చేశారు. కుమార్తె అపహరణకు గురైన విషయం తల్లికి తెలియనివ్వలేదు. తండ్రికి సమాచారం ఇవ్వగా బుధవారం రాత్రి ఆస్పత్రికి చేరుకొని బోరున విలపించాడు.

బతుకమ్మకు ప్రత్యేక స్థానం: ఎమ్మెల్యే



కుడికుంటలో బతుకమ్మ ఘాట్‌ను ప్రారంభించిన గూడెం మహిపాల్‌రెడ్డి

ఐడీఏ బొల్లారం(జిన్నారం), న్యూస్‌టుడే: తెలంగాణలో సంస్కృతిలో బతుకమ్మ పండగకు ప్రత్యేక స్థానం ఉందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఐడీఏ బొల్లారం పురపాలిక పరిధిలోని కుడి కుంట వద్ద రూ.77 లక్షలతో నిర్మించిన బతుకమ్మ ఘాట్‌ను ప్రారంభించారు. అక్కడే హైమాస్ట్ విద్యుత్తు దీపాలు ప్రారంభించి ఘాట్ ఆవరణలో జంబి చెట్టు నాటారు. అన్ని వసతులతో ఘాట్ నిర్మాణం చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో పురపాలిక అధ్యక్షురాలు కె.రోజారాణి, ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి, కమిషనర్ మంగతాయారు, ఆర్వో నర్సింలు, నాయకులు బాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, హనుమంతరెడ్డి, వరప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండగ పూట పస్తులుండాలా: సీఐటీయూ

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: పట్టణాన్ని శుభ్రం చేసే పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇవ్వకపోతే పండగ పూట పస్తులుండాలా అని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ ప్రశ్నించారు. జహీరాబాద్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గురువారంలోపు చెల్లించకుంటే పారిశుద్ధ్య పనులు నిలిపివేస్తామని హెచ్చరించారు.

గ్రామాభివృద్ధికి నిర్ణయాలు

జిన్నారం, న్యూస్‌టుడే: మండలంలోని మంగంపేటకు నష్ట చేసే చర్యలను అడ్డుకుని తీరుతామని గ్రామస్థులు బుధవారం తీర్మానం చేశారు. మండల ప్రత్యేకాధికారి మల్లేశం అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. మంగంపేట-ఊట్ల మధ్య గల లింక్ రహదారిని పునరుద్ధరించాలని, పల్లె ప్రకృతి వనం నిర్మించాలన్నారు. పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని పునర్‌నిర్మించాలని కోరారు. కార్యదర్శి రత్నమణి, నాయకులు జయప్రకాశ్, నరేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



దేవాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

గుమ్మడిదల, న్యూస్‌టుడే: గుమ్మడిదల కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగాయి. శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వర స్వామికి వేద పండితులు బుధవారం శాస్త్రోక్తంగా ఏకాంత సేవ నిర్వహించారు. దీంతో ఉత్సవాలు ముగిశాయి. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త నరసింహాచార్యులు, కమిటీ అధ్యక్షులు లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డులా మినీ శిల్పారామం

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్: హస్తకళలను ప్రోత్సహించాలన్న సంకల్పంతో అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంగారెడ్డి శివారులో మినీ శిల్పారామం నిర్మించాలని నిర్ణయం తీసుకున్నాయి. నిధులు సైతం కేటాయించి పనులు చేపట్టారు. ఆ తర్వాత నిధులు సరిపోకపోవడం.. శాసనసభ ఎన్నికలు రావడం.. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారడంతో పనులు నిలిచిపోయాయి. మూడేళ్లుగా దానిని డంపింగ్ యార్డులా మార్చేశారు.

నిధులు లేక నిలిచిన పనులు



సంగారెడ్డి శివారులోని శిల్పారామం ముఖద్వారం

తొలుత పోతిరెడ్డిపల్లిలో..

2012లో సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లిలోని 65వ నంబరు జాతీయ రహదారి పక్కన మినీ శిల్పారామం ఏర్పాటుకు అప్పటి ప్రభుత్వం ఆమోదం ప్రకటించింది. కేంద్రం వాటాగా రూ.3 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1.70 కోట్లు మంజూరు చేసింది. పోతిరెడ్డిపల్లిలో పనులు వద్దంటూ అక్కడి రైతులు అభ్యంతరం తెలిపారు దీంతో అక్కడి నుంచి సంగారెడ్డి శివారులోని మహబూబ్ సాగర్ చెరువు ఎగువ ప్రాంతంలోని అయిదెకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. అప్పటి ప్రభుత్వ విప్, సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి పనులు ప్రారంభించారు. మినీ శిల్పారామంతో పాటు హంపీ థియేటర్, దుకాణాల సముదాయం, తదితర భవనాల పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టారు. చివరికీ 2014లో శాసనసభ ఎన్నికల రావడంతో కేవలం కల్యాణ మండపం నిర్మాణాన్నే పూర్తి చేశారు. దీనిని జగ్గారెడ్డి ప్రారంభించారు.

ప్రతిపాదనలతో సరి..: 2014 శాసనసభ ఎన్నికలలో జగ్గారెడ్డి ఓటమి చెందారు. తెరాస తరుపున పోటీ చేసిన చింతా ప్రభాకర్ గెలిచారు. అసంపూర్తి పనుల పూర్తికి రూ.5.30 కోట్ల నిధులు అవసరం అవుతాయని అప్పటి మంత్రులు హరీశ్‌రావు, జోగు రామన్నకు ప్రతిపాదనలు పంపారు. కానీ డబ్బులు మంజూరు కాలేదు.

వినియోగంలోకి కల్యాణ మండపం..

కల్యాణ మండపం వినియోగంలోకి వచ్చినా కొంతకాలంగా నిరుపయోగంగా ఉంది. కొంతకాలం క్రితం ప్రైవేట్ ఏజెన్సీకి లీజుకు ఇచ్చారు. అక్కడ పెళ్లిలు, ఇతర వేడుకలు జరుగుతున్నాయి. మిగిలిన శిల్పారామం పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. చేపట్టిన పనులు ఆనవాళ్లు లేకుండా కనుమరుగయ్యాయి. పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి కనిపించకుండా పోయాయి. 13 ఏళ్లుగా అడుగులు ముందుకు పడలేదు.



ఆవరణలో చెత్తాచెదారం

చెత్తంతా ఇక్కడే పారబోత: సంగారెడ్డి పట్టణంలో ప్రత్యేకంగా డంపింగ్ యార్డు లేకపోవడంతో పట్టణవాసులు వినియోగించిన చెత్తాచెదారం అంతా నీటి వనరులు, ఖాళీ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, శిల్పారామంలో పారబోస్తున్నారు. మూడేళ్లుగా అక్కడ భారీగా చెత్త వేయడంతో గుట్టలుగా పేరుకుపోయి డంపింగ్ యార్డులా మారింది.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా..

నిధుల్లేక పనులు ఆగిపోయాయి. మళ్లీ ప్రతిపాదనలు పంపుతాం. వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటాం. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా. హైదరాబాద్‌లోని హస్తకళల శాఖ అధికారులకు విన్నవిస్తాం.

–పద్మజారాణి, డీఆర్‌వో, సంగారెడ్డి.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఫోన్ చేయాల్సిన నంబర్లు (10AM TO 1 PM)
సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363
నారాయణఖేడ్ 8008573248, నారాయణఖేడ్ టౌన్ 8008573250
అందోలు 8008573241, జిన్నారం 8008573231

? జోగిపేట పట్టణంలోని 16వ వార్డులో ఆర్యసమాజ్ ముందున్న రహదారి పూర్తిగా పూర్తిగా శిథిలమైంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. -శంకర్, జోగిపేట

✓ కొత్త సీసీ రహదారిని నిర్మించి వాహనదారుల సమస్య పరిష్కరిస్తాం. -తిరుపతి, పుర అధ్యక్షుడు అందోలు- జోగిపేట.

? జోగిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని క్రీడా మైదానంలో పచ్చగడ్డి పెరిగింది. విష సర్పాలు తిరుగుతున్నాయి. విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. -నాగయ్య, జోగిపేట.

✓ పాఠశాల ఆవరణలో పెరిగిన పచ్చగడ్డిని శుభ్రం చేయిస్తాం. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకుంటాం. -కృష్ణ, మండల విద్యాధికారి అందోలు.

బొల్లారం సందర్శించిన అదనపు కలెక్టర్

జిన్నారం: ఐడీఏ బొల్లారంను జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ బుధవారం సందర్శించారు. బతుకమ్మ ఘాట్‌ను పరిశీలించారు. కమిషనర్ మంగతాయారుతో పాటు వివిధ విభాగాల అధికారులకు పలు సూచనలు చేశారు. ఛైర్‌పర్సన్ రోజా రాణి పట్టణంలో ప్రగతి పనులను వివరించారు.

బాధ్యతలు స్వీకరించిన సీడీసీ ఛైర్మన్



సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి మండలం పుల్‌కల్‌లోని గణపతి చక్కెర కర్మాగారం(సీడీసీ) ఛైర్మన్‌గా గడీల రాంరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, పరిశ్రమ జీఎం కృష్ణమోహన్, పీసీసీ కార్యదర్శి జుబల కంటి అంజనేయులు, ఆత్మ కమిటీ ఛైర్మన్ వై.ప్రభు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక పూల పండగ



గుమ్మడిదల రైతు వేదిక వద్ద..



జహీరాబాద్ పురపాలక కార్యాలయం ఆవరణలో.

గుమ్మడిదల, న్యూస్‌టుడే: గుమ్మడిదలలో మహిళా అధికారులు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. బుధవారం స్థానిక రైతు వేదిక వద్ద ఎంపీడీవో ఉమాదేవి ఆధ్వర్యంలో మండల పరిధిలోని మహిళా కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది, అంగన్‌వాడీ ఉపాధ్యాయినులు తీరొక్క పూలతో బతుకమ్మలను తయారుచేశారు. రైతు వేదిక వద్ద ఆడిపాడిన అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

జహీరాబాద్, న్యూస్‌టుడే: జహీరాబాద్ పురపాలక సంఘం కార్యాలయం ఆవరణలో బతుకమ్మ ఆడారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు బతుకమ్మలు తీసుకురాగా కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మెప్మా అధికారులు పూజలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అని పేర్కొన్నారు. అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళలు, ఆడిపాడారు. కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, పారిశుద్ధ్య అధికారిణి సంధ్యా కుమారి తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు తీగ చోరీ.. నిలిచిన నీటి సరఫరా

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వ్యక్తులు ఖేడ్ ఆర్టీసీ డిపోనకు సంబంధించిన బోరు కనెక్షన్ ఉన్న సర్వీసు తీగను మంగళవారం రాత్రి ఎత్తుకెళ్లడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. బస్సుల సర్వీసింగ్, తాగడానికి, ఇతర అవసరాల కోసం డిపో పక్కన చాలా ఏళ్ల కిందట బోరు వేసి కనెక్షన్ ఇచ్చారు. బోరు చుట్టూ ఇనుపగ్రిల్ ఏర్పాటు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్తు స్తంభం నుంచి బోరు వరకు గల 500 మీటర్ల సర్వీసు తీగ కోసి ఎత్తుకెళ్లారు. బుధవారం బోరు వేయగా నీళ్లు రాకపోవడంతో సర్వీస్ తీగ చోరీకి గురైనట్లు తెలిసింది. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.



కేతకిలో సరస్వతీదేవిగా...



కానుకుంటలో..



తుల్జాపూర్‌లో ఎంపీ సురేశ్ షెట్కార్



చిట్కుల్‌లో నీలం మధు



ఐడీఏ బొల్లారంలో..

అమ్మవారి వైభవం.. భక్తులకు అభయం

ఝరాసంగం, నారాయణఖేడ్, జిన్నారం, మనూరు, జహీరాబాద్, గుమ్మడిదల, సంగారెడ్డి మున్సిపాలిటీ: జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఝరాసంగం కేతకి సంగమేశ్వరస్వామి ఆలయం, ఖేడ్ పట్టణంలోని శాస్త్రీనగర్, మంగల్‌పేట, ఐడీఏ బొల్లారం పట్టణంలోని కేబీఆర్ కాలనీ, మనూరు మండలం బోరంచ, గుమ్మడిదల మండలం వీరభద్రస్వామి ఆలయం, కానుకుంటలోఅమ్మవార్లు బుధవారం సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. బోరంచలో అమ్మవారికి ఖేడ్ ఎమ్మెల్యే సతీమణి అనుపమారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. జహీరాబాద్ పట్టణంలోని మాణిక్‌ప్రభు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు కొనసాగాయి. చిన్నారి ప్రజ్ఞశ్రీ అమ్మవారి వేషధారణలో ఆకట్టుకుంది. జంగంపేటలో కుంకుమార్చన చేశారు. గుమ్మడిదల వీరభద్రస్వామి, సంగారెడ్డి భవానీ భువనేశ్వరి ఆలయంలో రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి పూజలు చేశారు. జహీరాబాదు ఎంపీ సురేశ్ షెట్కార్ బుధవారం మహారాష్ట్రలోని తుల్జాపూర్ తుల్జాభవానీమాత అమ్మవారిని దర్శించుకున్నారు. పటాన్‌చెరు మండలం చిట్కుల్ తుల్జా భవాని అమ్మవారిని కాంగ్రెస్ పార్టీ నాయకుడు నీలం మధు దర్శించుకున్నారు. ఇస్నాపూర్ సెంట్రింగ్ యూనియన్ ఆధ్వర్యంలో ఇస్నాపూర్ చౌరస్తాలో నెలకొల్పిన మండపంలో అమ్మవారిని దర్శించుకున్నారు.

సేంద్రియ ఉత్పత్తులే ఆరోగ్యానికి మేలు



విక్రయ కేంద్రం ప్రారంభించిన ఛైర్మన్ మల్లయ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు

జోగిపేట, న్యూస్‌టుడే: సేంద్రియ ఉత్పత్తులు ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ ఛైర్మన్ మల్లయ్య అన్నారు. జోగిపేటలో బుధవారం సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా స్థానిక లక్ష్మీనర్సింహ స్వయం సహాయక సంఘ సభ్యులు పురదుకాణ సముదాయంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ఆ మహిళా సంఘం సభ్యులు పండిస్తున్న బియ్యం, కూరగాయాలు వంటి ఉత్పత్తులను విక్రయిస్తారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చిట్టిబాబు, శంకర్, నాగరాజు, డేవిడ్, ప్రవీణ్ కుమార్, సత్యం, కమిషనర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

కోహీర్, న్యూస్‌టుడే: ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ఆసక్తి చూపాలని, అధిక లాభాలు వస్తాయని అధికారులు పేర్కొన్నారు. మండల పరిధిలోని బిలాల్‌పూర్ రైతు వేదికలో బుధవారం వ్యవసాయ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. మొక్కలు నాటిన నాలుగో సంవత్సరం నుంచి పంట చేతికి వస్తుందన్నారు. ఒక్కసారి నాటితే 30 ఏళ్ల వరకు లాభాలు పొందవచ్చని స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి పలు రాయితీలు వస్తాయన్నారు. సమావేశంలో జిల్లా ఉద్యాన అధికారి సోమేశ్వర్ రావు, తహసీల్దార్ బాల శంకర్, ఏడీఏ భిక్షపతి, ఏవో నవీన్ కుమార్, ఏఈవోలు ప్రశాంత్, సవిత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సేవకులు లక్ష్యంతో ముందుకు సాగాలి

గుమ్మడిదల, న్యూస్‌టుడే: ఆర్ఎస్ఎస్ సేవకులు దేశ నిర్మాణం అనే లక్ష్యాన్ని పెట్టుకుని ముందుకు సాగాలని ఆర్ఎస్ఎస్ మెదక్ విభాగ ప్రచారక్ వడ్డేటి భూమేష్ తెలిపారు. బుధవారం సాయంత్రం గుమ్మడిదల శ్రీ వివేకానంద ఉన్నత పాఠశాలలో ప్రాథమిక శిక్షా వర్గ ముగింపు సమావేశం నిర్వహించారు. వారం రోజుల పాటు ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

కొల్చారం: జోగిపేట పట్టణానికి చెందిన మధునాల నిఖిల్ మెదక్ డీపీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం కార్యాలయానికి వెళ్తుండగా రాంపూర్ శివారుకు రాగానే మెదక్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు తన ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. బైక్ మంటల్లో కాలిపోయింది. స్థానికులు గాయపడిన నిఖిల్‌ను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మహమ్మద్ గౌస్ తెలిపారు.

లింగమయ్యగౌడ్‌కు నివాళి

జోగిపేట టౌన్: పట్టణానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, తామ్రపత్ర గ్రహీత లింగమయ్యగౌడ్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాన్ని బుధవారం తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మఠం భిక్షపతి పరామర్శించారు. లింగమయ్యగౌడ్‌కు నివాళి అర్పించారు.

12, 13 తేదీల్లో మల్లన్నస్వామి ఆలయంలో ఉత్సవాలు



జహీరాబాద్, న్యూస్‌టుడే: బీదర్ జిల్లా బాల్కి తాలూకా ఖానాపూర్‌లో వెలసిన మల్లన్నస్వామి ఆలయంలో ఈ నెల 12, 13 తేదీల్లో ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రకాశ్ మైత్రే, కార్యనిర్వాహణాధికారి అనంతరావు కులకర్ణి ఒక ప్రకటనలో తెలిపారు. 12వ తేదీన స్వామివారి రథోత్సవం, రాత్రి డొల్లుకుణితి, వాగయ్యకుణితి, కాటి కుణితి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 13న ఆలయంలో మహామంగళహారతి, రథోత్సవం ముగింపు ఉంటుందని తెలిపారు. సరిహద్దుకు సమీపంలో వెలసిన ఈ ఆలయానికి కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతలతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వెళ్తుంటారు.

పత్తి రైతులకు అవగాహన

సిర్గాపూర్(కంగ్టి), న్యూస్‌టుడే: అధిక వర్షాలతో పత్తిలో పోషకాలు లోపిస్తాయని ఖేడ్ సహాయ వ్యవసాయ సంచాలకులు నూతన్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన జమ్గి(బీ) శివారులో పత్తి పంటను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు చేశారు. కాయలు ఏర్పడే దశలో వారానికి ఒకసారి పిచికారీ చేసుకోవాలన్నారు. యాసంగిలో నువ్వులు, మొక్కజొన్న, శనగ, జొన్న, మినుము, కుసుమ వేసుకుంటే అధిక దిగుబడి వస్తుందన్నారు. ఏఈవో భార్గవ్ చారి, రైతులు విఠల్, మహిపాల్, మొగులన్న పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

ఝరాసంగం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని, భజన కీర్తనలు చేసి దేవుడి ఆశీస్సులు పొందాలని కుప్పానగర్ మల్లన్నగుట్ట ఆశ్రమ పీఠాధిపతి బసవలింగ అవధూత అన్నారు. బుధవారం కుప్పానగర్ భవానీమాత ఆలయం వద్ద రాయికోడ్ మండలం ఖాన్‌జమల్‌పూర్ భజన మండలి సభ్యుల ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి.

ఖేడ్ పీఆర్ ఏఈగా విద్యాసాగర్‌రెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ సహాయ ఇంజినీరుగా విద్యాసాగర్‌రెడ్డి నియమితులయ్యారు. బదిలీపై వచ్చారు. మనూరు, నాగల్‌గిద్దా మండలాలకు నూతనంగా ఉద్యోగం పొందిన రజనీకాంత్ బాధ్యతలు స్వీకరించారు.

మొక్కలు నాటడం అందరి బాధ్యత

ఝరాసంగం: పర్యావరణాన్ని పరిరక్షిస్తూ మొక్కలు నాటి పరిరక్షించడం అందరి బాధ్యత అని తహసీల్దార్ తిరుమలరావు అన్నారు. బుధవారం ఝరాసంగం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ఆవరణలో కొబ్బరి, మామిడి మొక్కలను నాటారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హన్మంతరావుపాటిల్, ఎంపీడీవో సుధాకర్, ఉపతహసీల్దార్ యాసీన్ పాల్గొన్నారు.

ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ విద్యుత్తు ఆర్టిజన్ కన్వర్షన్ ఐకాస రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సింగిరెడ్డి చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్లో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఆర్టిజన్ కార్మికులందరినీ కన్వర్షన్ చేయాలని కోరారు.

ఎంపీడీవోగా శిక్షణ కలెక్టర్



మనోజ్

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో శిక్షణ పొందుతున్న అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్ బుధవారం అందోలు ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో రాజేష్ కుమార్ వ్యక్తిగత పనుల నిమిత్తం సెలవులపై వెళ్లారు. శిక్షణతో పాటు ఎంపీడీవోల పనితీరుపై క్షేత్రస్థాయిలో అవగాహన కలుగుతుందని మనోజ్ పేర్కొన్నారు.

అందుబాటులోకి ప్రయాణ ప్రాంగణం



ప్రాంగణంలో పరిశ్రమ ప్రతినిధులు


గుమ్మడిదల, న్యూస్‌టుడే: ప్రయాణికుల సౌకర్యార్థం ప్రాంగణం ఏర్పాటు చేయడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అన్నారం గ్రామ పరిధిలో అన్నోర(హెటెరో యూనిట్) పరిశ్రమ సౌజన్యంతో నిర్మించిన ప్రయాణ ప్రాంగణాన్ని పంచాయతీ కార్యదర్శి సంగీత, పరిశ్రమ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. పరిశ్రమ హెచ్ఆర్ ప్రతినిధి బీవీ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నాయకులు వీరారెడ్డి, జైశంకర్‌గౌడ్, మురళి పాల్గొన్నారు.

విద్యుత్తు ఉప కేంద్రంలో ఆయుధ పూజ

వట్‌పల్లి, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మేడికుంద విద్యుత్తు ఉప కేంద్రం ఆవరణలో సిబ్బంది ఆయుధ పూజను భక్తి శ్రద్ధలతో చేశారు. కార్యక్రమంలో నారాయణగౌడ్, విదితయ్య, విజయ్‌కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలలు.. 70 రహదారులు..

న్యూస్‌టుడే, జిన్నారం: ఐడీఏ బొల్లారం పురపాలిక పరిధిలో రహదారుల తీరు మారుతోంది. ఇక పారిశ్రామికవేత్తలు, కార్మికులు, సాధారణ జనం రాకపోకలకు ఇబ్బందులు తీరనున్నాయి. 70 రహదారుల నిర్మాణం చేపట్టగా చాలా వరకు చివరి దశలో ఉన్నాయి. కొన్ని పూర్తయ్యాయి. ప్రధాన రహదారులతో పాటు కాలనీలోని అంతర్గత రోడ్లు బాగవుతున్నాయి. ఇప్పటిదాకా రూ.13 కోట్లు ఖర్చు చేయగా మరో రూ.2.3 కోట్ల పనులు చేయనున్నారు.



ఐడీఏ బొల్లారంలో ఇటీవల పూర్తయిన ప్రధాన రహదారి

మిషన్ భగీరథ పనులతో..

ఐడీఏ బొల్లారం పట్టణ పరిధిలో మిషన్ భగీరథ పనులు చాలా ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఒక రకంగా పోరాటం చేసి సాధించుకోవాల్సి వచ్చింది. ఇక పైపులైన్ కోసం తీసిన కాల్వలతో ప్రధాన రహదారులు, కాలనీల్లోని అంతర్గత రోడ్లు ధ్వంసం అయ్యాయి. కాలు బయట పెట్టాలంటే సాహసం చేసే పరిస్థితులు వచ్చాయి. ఇక వర్షాకాలం అయితే ఆ బాధలు చెప్పలేం. దీంతో పాలక వర్గం రహదారుల బాగు కోసం నిధులు వెచ్చించింది.

రూ.50 లక్షల చొప్పున

జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు జ్యోతి థియేటర్ నుంచి పాత పురపాలిక కార్యాలయం వరకు సీసీ రోడ్డు వేశారు. ఇందుకు గాను రూ.2 కోట్లు ఖర్చు చేశారు. అలాగే 22 వార్డులకు ఒక్కో దానికి రూ.50 లక్షల చొప్పున కేటాయించారు. ఒక్కో కాలనీలో కనిష్ఠంగా 3 సీసీ రోడ్లకు మోక్షం కలిగింది. ఫలితంగా 66 అంతర్గత రోడ్లు బాగుపడ్డాయి. ఇవి కాకుండా బీరప్పబస్తీ, పోచమ్మబస్తీతో పాటు కొన్ని ప్రధాన రహదారులను రూ.2.3 కోట్లతో సీసీలుగా మార్చడానికి ప్రక్రియ ప్రారంభించారు. దసరా తరువాత మొదలుకానున్నాయి. ఐడీఏ బొల్లారం పట్టణ పరిధిలో రోడ్ల సమస్య చాలా వరకు పరిష్కారం అయిందని, మిగిలినవి పూర్తి చేస్తామని పురపాలక అధ్యక్షురాలు కె.రోజారాణి చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మునిపల్లి, న్యూస్‌టుడే: కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై రాజేష్ నాయక్ తెలిపిన వివరాలు.. మునిపల్లి గ్రామానికి చెందిన మన్నే శ్రీశైలం (51) ఈ నెల 5న కడుపు నొప్పి భరించలేక ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. భార్య అనసూజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

సంగారెడ్డి ఠాణా పరిధిలో మరొకరు..

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సంగారెడ్డి పట్టణ ఠాణా పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పట్టణ సీఐ భాస్కర్ తెలిపిన వివరాలు.. సుమారు 45ఏళ్ల వయసుండే వ్యక్తి సంగారెడ్డి పట్టణ శివారు ఫంక్షన్ హాల్ సమీపంలోని దర్గా వద్ద స్పృహ కోల్పోయి ఉన్నాడు. పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన నర్సింలు డయల్ 100కు సమాచారం ఇచ్చారు. వెంటనే ప్రభుత్వ అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు.

12 మంది జూదరులపై కేసు

మనూరు, న్యూస్‌టుడే: గుట్టుచప్పుడు కాకుండా జూదం ఆడుతున్న 12 మందిపై కేసు నమోదు చేశామని నాగల్‌గిద్ద ఎస్సై సాయిలు తెలిపారు. ఔదత్‌పూర్‌లో జూదం ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి 12 మందిని అదుపులోకి తీసుకున్నాం. వారి వద్ద రూ.24,000 నగదు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.